క్లుప్తంగా...

ఐటీఐలో 31లోపు దరఖాస్తు చేసుకోవాలి

మేడ్చల్: మేడ్చల్‌లోని ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శైలజ తెలిపారు. ఒక సంవత్సరం కోర్సులైన డీజిల్ మెకానిక్, వెల్డర్, రెండు సంవత్సరాల కోర్సులైన టర్నర్, ఫిట్టర్, ఎలక్ట్రిషన్, ఎలక్ట్రానిక్స్ తదితర ట్రేడులలో చేరేందుకు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఒకటి, రెండు దశల అడ్మిషన్లు ముగిశాయని, మూడవ దశలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

వృద్ధుడిపై గుర్తుతెలియని వ్యక్తి కత్తితో దాడి

కీసర: గుర్తుతెలియని వ్యక్తి ఓ వృద్ధుడిపై కత్తితో దాడిచేసి గాయపర్చిన ఘటనలో అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీలో చోటుచేసుకుంది. కీసర సీఐ ఎం.వెంకటయ్య వివరాల ప్రకారం ఆర్‌జీకే కాలనీలో నివాసం ఉండే కుమ్మరి చంద్రయ్య(60) బుధవారం తన దుకాణం వద్ద కూర్చొని ఉండగా గుర్తు తెలియని వ్యక్తి అకస్మాత్తుగా కత్తితో దాడి చేసి పరారయ్యాడు. తల, ఛాతిపై గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన వృద్ధుడిని నగరంలోని ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కీసర పోలీసులు తెలిపారు.

బీజేపీ నాయకుల అరెస్ట్



మేడ్చల్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల అంశంపై బీజేపీ నిర్వహిస్తున్న ధర్నాలకు నాయకులు తరలివెళ్లకుండా మేడ్చల్ బీజేపీ నాయకులను పోలీసులు బుధవారం ఉదయం ముందస్తు అరెస్ట్ చేశారు. మేడ్చల్ మండల, మున్సిపాలిటీల నాయకులను మేడ్చల్ పోలీసులు, గుండ్లపోచంపల్లి నాయకులను పేట్‌బషీరాబాద్ పోలీసులు ఉదయాన్నే అరెస్ట్ చేసి ఠాణాలకు తరలించి ఆ తర్వాత విడుదల చేశారు. అరెస్ట్ అయిన వారిలో నాయకులు మోహన్‌రెడ్డి, జాకట ప్రేందాస్, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ కవర్లు అమ్మినా.. వాడినా చర్యలు



దుకాణాలను తనిఖీ చేస్తున్న కమిషనర్

మేడ్చల్: పట్టణ పరిధిలో వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు అమ్మినా.. వాడినా చట్టపరమైన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆయన పట్టణంలో రెస్టారెంట్లు, హోటళ్లు, దుకాణాలు, ఇతర వ్యాపారాలను తనిఖీ చేశారు. ప్రభుత్వం 75 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను నిషేధించిందని, వాటిని వాడితే చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను వినియోగించడం ప్రజలు పూర్తిగా మానుకోవాలని ఆయన కోరారు. ట్రేడ్ లైసెన్స్‌లు లేని వారు వెంటనే లైసెన్సులు తీసుకోవాలని, లేనిపక్షంలో వారి వ్యాపారాలను సీజ్ చేస్తామన్నారు. హోటళ్లు, దుకాణాలు, రెస్టారెంట్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఓ రాంచందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఎన్విరాన్‌మెంట్ ఏఈ జ్ఞానేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా వెంకటేశ్‌ముదిరాజ్



నియామక పత్రం అందుకుంటున్న లింగస్వామి వెంకటేశ్‌ముదిరాజ్

ఘట్‌కేసర్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్‌ఎఫ్‌సీనగర్ నివాసి మాజీ సర్పంచ్ వెంకటేశ్‌ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా లింగస్వామి బుధవారం ఎన్నికయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ వారిని నియమించగా జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియామక పత్రం అందజేశాడు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలను రాజకీయ పార్టీలు విస్మరిస్తున్నాయని, అలాంటి పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా బాధ్యుడు రమేశ్, సత్యనారాయణ, నరేశ్‌ముదిరాజ్, బాబు, శేఖర్, రమేశ్, మనోహర్, ఉపేందర్ పాల్గొన్నారు.





మహాన్.. చంద్రయాన్..

ఏ నోట విన్నా.. ఏ ఫోన్ చూసినా.. ఏ ఇంట్లో టీవీ చూసినా.. ఒక్కటే చంద్రయాన్‌-3 గురించే.. బుధవారం సాయంత్రం చంద్రుడిపై సేఫ్ ల్యాండింగ్ కాగానే ఎక్కడ చూసినా సంతోషాలే.. ఎక్కడ నలుగురు కనిపించినా చప్పట్లతో శెభాష్ ఇస్రో అంటూ మెచ్చుకున్నారు. ప్రపంచ దేశాల ముందు భారత్ తలెత్తుకునేలా చేసిన సైంటిస్టులను అభినందించారు.

బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం



అర్కల్‌గూడలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించడం ఖాయమని, మూడవసారి కేసీఆర్ సీఎం బాధ్యతలు చేపట్టడం ఖాయమని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి సుతారిగూడ, అర్కల్‌గూడ, బాసిరేగడి, జ్ఞానాపూర్ గ్రామాల్లో రూ.4 కోట్ల నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వైకుంఠ దామం తదితర అభివృద్ధి పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. రూ.కోట్ల రూపాయల నిధులు వెచ్చించి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామని, దీంతో గ్రామాల్లో ప్రజలు కేసీఆర్ మళ్లీ రావాలని కోరుతున్నారన్నారు. ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి పనులు బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేయడంతో ప్రజలు బీఆర్ఎస్‌కు పట్టం కట్టి మూడవసారి అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో, దేశంలో కాంగ్రెస్ పార్టీ దివాలా తీసిందని, బీజేపీ దేశాన్ని సర్వనాశనం చేసిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రజల ఆశీస్సులతో బీఆర్ఎస్ 100 సీట్లు గెలవడం ఖాయమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ రాములు, కౌన్సిలర్లు శ్రీలతశ్రీనివాస్‌రెడ్డి, రజిత వెంకటేశ్, రాజకుమారిసుధాకర్, ఆంతోనమ్మ, జైపాల్‌రెడ్డి, హేమంత్‌రెడ్డి, పెంటయ్య, వీణ, ఫిలిప్స్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంచుతున్న ప్రభుత్వం

సాక్షి, మేడ్చల్ జిల్లా: దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని, వీరికి దేశంలో ఎక్కడా లేని విధంగా పింఛన్లు కూడా అందజేస్తోందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ ప్రజలకు ఉపయోగపడే ఎన్నో సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టి, అర్హులకు సక్రమంగా అందేలా అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దివ్యాంగులకు రూ.3,016 నుంచి రూ.4,016లకు పెంచిన ఆసరా పింఛన్ ప్రారంభం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో అర్హులైన 6,461 మంది దివ్యాంగులకు ప్రభుత్వం పెంచిన రూ.4,016 పింఛన్ ప్రొసీడింగ్ పత్రాలను ఆయన అందజేశారు. ప్రభుత్వం దివ్యాంగులకు ఎంత చేసినా తక్కువేనన్నారు. ఇల్లు లేని దివ్యాంగులు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటే.. మొదటి ప్రాధాన్యత కింద అలాట్ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి పద్మజారాణి, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్ పర్సన్లు, సంబంధిత జిల్లా శాఖ అధికారులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌ను అభివృద్ధి చేస్తాం



మార్కెట్ వద్ద బోరును ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ దీపికరెడ్డి



రాఘవేంద్రనగర్‌లో సీసీ పనులు ప్రారంభిస్తూ..

మేడ్చల్: పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి వ్యాపారులు, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి అన్నారు. 17వ వార్డులో ఉన్న మార్కెట్ వద్ద తాగునీటి వసతి కోసం ఏర్పాటు చేస్తున్న బోరును ఆమె కౌన్సిలర్ అర్చన సందీప్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. మార్కెట్‌లో వ్యాపారులు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారని, బోరు నిర్మాణం చేయాలని విజ్ఞప్తులు రావడంతో వెంటనే మంజూరు చేసి బోరు వేయించినట్లు తెలిపారు. మార్కెట్‌లో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. వ్యాపారులు, 17వ వార్డు నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మేడ్చల్ పట్టణంలోని 16వ వార్డులో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి ప్రారంభించారు. వార్డులోని రాఘవేంద్రనగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు ఆమె కౌన్సిలర్ ఉమానాగరాజుతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. మంత్రి మల్లారెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి సహకారంతో వార్డులో అన్ని వీధుల్లో సంపూర్ణ సీసీ రోడ్ల నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆదర్శంగా మున్సిపాలిటీని తీర్చిదిద్దుతా..



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని 7, 16వ వార్డుల్లో సుమారు రూ.15 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న అంతర్గత మురుగు కాల్వల నిర్మాణ పనులు, సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పాలకవర్గం సభ్యుల సహకారంతో ముందుకెళ్లి వివిధ వార్డుల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు మాదిరెడ్డి పావనిరెడ్డి, మోర నర్సింహారెడ్డి, నాయకులు హరిగౌడ్, ఖాజమియా, కాలనీ అధ్యక్షుడు పాల్గొన్నారు.

ప్రయత్నిస్తే అద్భుతాలు సాధించవచ్చు

మేడ్చల్‌రూరల్: మనిషి ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీ లేదని, అద్భుతాలు సాధించవచ్చని అందుకు నిదర్శనం తానేనని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ఓరియంటేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎలాంటి టెక్నాలజీ లేని కాలానికి చెందిన తానే పాలమ్మే స్థాయి నుంచి మంత్రి స్థాయికి ఎదిగానని, అందుకు నిత్యం కష్టపడటమే కారణమన్నారు. ఒడిదుడుకులను అధిగమనిస్తేనే విజయం సాధించగలమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్, ఎమ్మార్‌జీవి మేనేజింగ్ డైరెక్టర్ శాలినిరెడ్డి, కళాశాల డైరెక్టర్ సుధీర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన నిందితుల రిమాండ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్, పోచారం పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడిన ఇద్దరు నిందితులను బుధవారం రిమాండ్‌కు తరలించారు. ఘట్‌కేసర్ పీఎస్‌లో మల్కాజ్‌గిరి డీసీపీ జానకి చోరీల వివరాలు వెల్లడించారు. ఖమ్మం జిల్లా పేనుబల్లి మండలం, వీఎం బంజార గ్రామానికి చెందిన తిరుపతి ప్రసాద్ (30) కుత్బుల్లాపూర్ శ్రీకృష్ణానగర్‌లో నివాసముంటున్నాడు. బుధవారం ఘట్‌కేసర్ బస్‌స్టాండ్‌లో పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించగా 8 చోరీలకు పాల్పడ్డట్లు తేలిందన్నారు. మొత్తం 60 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, వరంగల్ జిల్లా పోలీసులు రెండుసార్లు పీడీ యాక్ట్ నమోదు చేశారన్నారు. అతడి దగ్గరి నుంచి 8 తులాల బంగారు ఆభరణాలు, 8 తులాల వెండి, రూ.4,600 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

పోచారం ఐటీ కారిడార్‌లో పీఎస్ పరిధిలో..

పోచారం ఐటీ కారిడార్ పోలీసులు మంగళవారం వెంకటాపూర్ టీ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై ప్రయాణిస్తున్న ఆదర్శనగర్, బాలాజీనగర్ జవహర్‌నగర్‌లో నివాసముండే రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ మండలం గౌరెల్లికి చెందిన బానోత్ శేఖర్(23), నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం ఆలూరుకు చెందిన కోసిదిగ నరేశ్(20)ను పోలీసులు ఆపి తనిఖీ చేయగా బంగారు, వెండి ఆభరణాలు లభించాయి. వారిని విచారించగా చౌదరిగూడ పీజేఎస్ కాలనీ, నిజామాబాద్ జిల్లా దేవన్‌పల్లి పీఎస్ పరిధిలో చోరీకి పాల్పడ్డట్లు తేలిందన్నారు. నిందితుల నుంచి బంగారు, వెండి ఆభరణాలు, సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

కీసర: మండల కేంద్రమైన కీసరలో బుధవారం కీసర జోనల్‌స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. క్రీడాపోటీల సందర్భంగా క్రీడా పోటీల్లో పాల్గొంటున్న కీసర ప్రభుత్వ పాఠశాలకు చెందిన సుమారు 40 మంది క్రీడాకారులకు కీసర మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదే రమేష్‌గుప్తా, క్రీడాదుస్తులను అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలన్నారు. గెలుపు ఓటములను సమానంగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. ముమ్ముందు జరిగే క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు కూడా క్రీడా దుస్తులను అందజేయనున్నట్లు తెలిపారు.



పట్టణ సేవలకు వార్డు అధికారులు

- వీఆర్ఏల సర్దుబాటులో పురపాలికల్లో వార్డు అధికారులు
- మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో కొనసాగుతున్న ప్రక్రియ

సాక్షి, మేడ్చల్ జిల్లా: పురపాలికల్లో వార్డు అధికారులు(ఆఫీసర్లు) రానున్నారు. వీఆర్ఏల సర్దుబాటుతో పురపాలికల్లో వార్డు అధికారుల నియామకానికి అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. పట్టణ ప్రజల సౌలభ్యం కోసం వార్డు స్థాయిలోనే అన్ని సేవలు అందించాలంటే.. ప్రతి వార్డుకు ఒక అధికారి ఉండాలని భావించిన ప్రభుత్వం పురపాలికలకు వీరిని కేటాయించింది. ఇటీవల వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన సర్కారు వారిని వివిధ శాఖల్లోకి సర్దుబాటు చేస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇప్పటికే ప్రతి డివిజన్‌లో వార్డు అధికారులను నియమించి వారి ద్వారా ప్రజల నుంచి అన్ని రకాల ఫిర్యాదులను స్వీకరిస్తూ.. సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇదే తరహాలో అన్ని పురపాలికల్లో కొనసాగించేందుకు అధికారుల నియామకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో మొత్తంగా 29 పురపాలక సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న డివిజన్లు, వార్డుల్లో వార్డు అధికారులను నియమించేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. కొత్తగా వచ్చిన వార్డు సిబ్బంది వల్ల పట్టణాల్లో సమస్యల పరిష్కారానికి అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు.

సేవల మెరుగు కోసం..

పురపాలికలు అంటేనే విస్తరిస్తున్న పట్టణాలు.. వీటిలో సమస్యల పరిష్కారం కత్తిమీద సాములాంటిదే. మంచినీరు, విద్యుత్తు దీపాలు, పారిశుద్ధ్యం, పందులు, వీధి కుక్కలు తదితర సమస్యలపై స్థానికులు పుర కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయాల్సి వచ్చేది. చాలా సందర్భాల్లో ఫిర్యాదు చేసినా ఫలితం ఉండేది కాదు. ఆయా ఇబ్బందుల పరిష్కారానికి సమయం పట్టేది. పురపాలికలకు అనుబంధ కాలనీలు, పాత గ్రామాలు ఉంటే అక్కడి పరిస్థితి అంతే. ఈ క్రమంలో వార్డుల్ని పర్యవేక్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా అధికారులను నియమించాలని నిర్ణయించి మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలకు 225 వీఆర్ఏలను బదిలీ చేయగా, వార్డు అధికారులుగా నియమించారు. ఇందులో 131 మందికి నియామక పత్రాలకు కూడా జారీ చేశారు. 2022లో పట్టణ ప్రగతి కార్యక్రమంలో పురపాలిక సిబ్బందిని వార్డు అధికారిగా నియమించారు. తాజాగా వార్డు అధికారిగా ప్రభుత్వ ఉద్యోగులు రానుండటంతో సేవలు మరింత మెరుగు పడగలవని ఆశిస్తున్నారు.

చేపట్టనున్న పనులివే..

పురపాలికల్లో వార్డు అధికారులకు పారిశుద్ధ్య సిబ్బందిని అనుసంధానం చేస్తారు. వారు కార్మికుల ద్వారా నీటి నిల్వలు తొలగించడం, పైపుల్లో ఆగిన చెత్తను తీసివేయడం, అక్రమ కట్టడాల కూల్చివేత, రహదారుల గుంతలు పూడ్చివేయడం, పశు కళేబరాల తొలగింపు వంటి పనులను చేయించాలి. ఇతర చోటకు వెళ్లాల్సిన అవసరం లేకుండా దివ్యాంగుల సంక్షేమం కోసం అక్కడే సేవలందిస్తారు. జనన, మరణ ధ్రువపత్రాలు వార్డులోనే అందించనున్నారు. ఆస్తి పన్ను వసూలు బాధ్యత వీరే చూడనున్నారు. ఆక్రమణలపై ఫిర్యాదులు స్వీకరించి తక్షణమే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత వీరిదే. వార్డుల్లో ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తారు. కౌన్సిలర్, అధికారికి భవిష్యత్‌లో ప్రత్యేక గదులు కేటాయించనున్నారు. అక్కడ కౌన్సిలర్, వారి అధికారి ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఇందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది.

కీసరను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నా..



కీసర 4వ వార్డులో అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ నాయకపు మాధురి



కీసరలో కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తూ..

కీసర: కీసర గ్రామాభివృద్ధికి కృషిచేయడం జరుగుతుందని గ్రామసర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్ అన్నారు. బుధవారం కీసర గ్రామ పంచాయతీ పరిధిలోని 4వ వార్డు పరిధిలోని వివిధ కాలనీల్లో సుమారు రూ.15 లక్షల గ్రామపంచాయతీ నిధులతో చేపట్టనున్న అంతర్గత మురుగు కాల్వల నిర్మాణ పనులను స్థానిక వార్డు సభ్యురాలు రామిడి స్వప్నవిజయ్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కీసర గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తటాకం నారాయణ, వార్డు సభ్యుడు రామారం ప్రదీప్, నేతలు రామిడి విజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సొంత నిధులతో సీసీ రోడ్డు

కీసర: మండల కేంద్రమైన కీసరలో మంత్రి మల్లారెడ్డి సుమారు రూ.30 లక్షల సొంత నిధులతో గ్రామంలో కీసరదాయర ప్రధాన రహదారి నుంచి ప్రభుత్వ పాఠశాల మీదుగా పోచమ్మ దేవాలయం వరకు చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం కీసర సర్పంచ్ నాయకపు మాధురి, ఎంపీటీసీ సభ్యుడు రమేష్‌గుప్తా, కీసర మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, కీసర మాజీ ఎంపీటీసీ సభ్యులు బెలిదేర మేష్‌గుప్తా, పంచాయతీ వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నేతలు తదితరులు పరిశీలించారు. మంత్రి మల్లారెడ్డి, సీఎంఆర్ హెల్త్ సిటీ చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి మాట నిలబెట్టుకున్నారన్నారు.

రాష్ట్రంలో కుటుంబ పాలనకు స్వస్తి పలకాలి

రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న ఎంపీ లక్ష్మణ్

ఘట్‌కేసర్: తెలంగాణలో కుటుంబ పాలనకు స్వస్తి పలకాలని, వేలాది మంది బలిదానాలతో ఏర్పడిన తెలంగాణ ఒకే కుటుంబంలోని నలుగురి పాలైందని రాజ్యసభ సభ్యుడు, బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డా. లక్ష్మణ్ విమర్శించారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ఉమ్మడి ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీ, ఘట్‌కేసర్ మండల బీజేపీ కార్యాలయాన్ని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనతో విసిగిన తెలంగాణ ప్రజలు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారన్నారు. దళిత బంధులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు 30 శాతం కమిషన్లు తీసుకుంటున్నారని, అవినీతిలో కూరుకుపోయిన వారికే సీఎం తిరిగి సీట్లు కేటాయించారన్నారు. మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించాలని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేపట్టిన ఎమ్మెల్సీ కవిత ఇప్పుడు తెలంగాణ భవన్, ప్రగతి భవన్ ఎదుట ధర్నా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల సహకారంతో సబ్ కా సాత్ సబ్ కా వికాస్ నినాదంతో ముందుకెళతామన్నారు. బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఎస్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బిక్కు నాయక్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, జిల్లా బాధ్యుడు నరేందర్, ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు ప్రవీణ్‌రావు, కౌన్సిలర్ మహేశ్, అవుషాపూర్ సర్పంచ్ కావేరి, మహిపాల్‌రెడ్డి, రామోజీ, శ్రీరాములు, శ్రీశైలం పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డికి జవహర్‌నగర్ ఉద్యమకారుల మద్దతు



మంత్రి మల్లారెడ్డికి అభినందనలు తెలుపుతున్న జవహర్‌నగర్ ఉద్యమకారులు



మంత్రి మల్లారెడ్డితో నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

జవహర్‌నగర్: మేడ్చల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా మంత్రి మల్లారెడ్డికి టికెట్ కేటాయించినందుకు జవహర్‌నగర్ కార్పొరేషన్ తెలంగాణ ఉద్యమకారులు బుధవారం మంత్రిని కలిసి అభినందనలు తెలిపారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ పథకాలతోనే ప్రజలు మరోసారి పట్టం కడతారన్నారు. అనంతరం జవహర్‌నగర్ ఉద్యమకారులు మాట్లాడుతూ.. మంత్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో జవహర్‌నగర్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఆయనకు ఉద్యమకారులందరం అండగా ఉంటామన్నారు. కార్పొరేటర్ మురుగేష్, ఉద్యమకారులు జిట్టా శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌చారి, రమేష్‌చారి, ప్రకాష్, పరశురాం, సోమయ్య, వెంకటేష్, రాజయ్య పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డికి అభినందనల వెల్లువ

కీసర: బీఆర్ఎస్ మేడ్చల్ అభ్యర్థిగా మంత్రి మల్లారెడ్డి పేరును ప్రకటించిన నేపథ్యంలో బుధవారం కీసర మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, నాగారం మున్సిపల్ పాలకవర్గం సభ్యులు, నేతలు మంత్రి మల్లారెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు ఆకిటి మహేందర్‌రెడ్డి, నాయకపు మాధురి, గోపాల్‌రెడ్డి, పెంటయ్య, రాజు, విమల, అండాలు, నేతలు గూడరు అంజన్న, ఆంజనేయులు, నాయకపు వెంకటేష్, నిమ్మల శ్రీనివాస్, కౌకుట్ల రాహుల్‌రెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, నిమ్మల శ్రీనివాస్, సాయినాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

వడ్డెరల ఉపాధికి సహకరించాలని వినతి

ఘట్‌కేసర్: రాళ్ల కొడుతూ జీవనోపాధి పొందుతున్న వడ్డెరలకు సహకరించాలని వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాత్రి వెంకటేశ్ ఆధ్వర్యంలో మంత్రి మల్లారెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. మంత్రిని ఆయన నివాసంలో కలిసి లేఖలో పేర్కొన్నారు. మర్పల్లిగూడ గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఇతర వడ్డెర కులస్తులు పాల్గొన్నారు.